


RNI TELTEL/2024/89620

తెలంగాణ

నేటి

# శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 189 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శనివారం 29 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ, సీతక్క



- రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె వ్యాఖ్యలతో తీవ్ర వివాదం
- కొండా సురేఖపై వేటు వేస్తారంటూ జోరుగా ప్రచారం
- రాఖీ పండుగ సందర్భంగా రేవంత్ నివాసానికి వెళ్లిన కొండా సురేఖ

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రక్షా బంధన్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. మంత్రులు కొండా సురేఖ, సీతక్క కలిసి సీఎం నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా, ఇటీవల పరకాల నియోజకవర్గం కేంద్రంగా చెలరేగిన తీవ్ర రాజకీయ వివాదం, కుమార్తె సుస్మిత వ్యాఖ్యల దుమారం తర్వాత మంత్రి కొండా సురేఖ నేరుగా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదానికి ప్రధాన కారణం ములుగు, పరకాల ప్రాంతాల్లో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న అధికారిక కార్యక్రమాలకు వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా ......

»2




# తెలంగాణలో అంగన్‌వాడీ 'ఉద్యోగాల జాతర'

## - ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

- సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక
- ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ
- రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ

## నేపాల్‌లో జల ప్రళయం..

### - 547కి చేరిన మృతుల సంఖ్య



- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం

»2

## రాఖీ పండుగకు టీజీఎస్‌ఆర్టీసీ ఛార్జీల బాదుడు



- రాఖీ పండుగ సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీ ఛార్జీల పెంపు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం
- రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు
- 1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి
- సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం

»2

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### - మంత్రి పొంగులేటి హామీ

- అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు
- జీహెచ్‌ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసులు




»2

- తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసులు జారీ
- ఓటర్ల జాబితాలో తండ్రి పేరు తప్పుగా ఉండటమే కారణం
- సర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల అందజేత
- పేరు సవరణ కోసం పత్రాలు సమర్పించిన మంత్రి

2

## ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?

### : కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్

- కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడా లేదన్న ఈటల
- సన్న బియ్యం కేంద్రం ఇస్తున్నా మోదీ ఫొటో వేయడం లేదని మండిపాటు
- కేంద్ర నిధుల వల్లే రాష్ట్రంలో రోడ్లు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి ....

2

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల
- తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు

**నేటి శుభోదయ, నిజామాబాద్ :** తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు 46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023-24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025-26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసు లు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం. కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి ...

»2



# తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసులు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు. ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే. ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

# తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్..
## ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

**నేటి శుభోదయ, తెల్లాపూర్ :** తగ్గడం ఊరటనిచ్చే అంశం. మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

# జీఎస్టీ 2.0: తెలంగాణ కుటుంబాలకు ఊరట.. తగ్గనున్న పన్ను భారం!

- జీఎస్టీ 2.0తో తెలంగాణ కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం
- ఆహార పదార్థాలపై పన్ను రేటు గణనీయంగా తగ్గుతుందని అంచనా
- ప్రస్తుతం 10.4 శాతంగా ఉన్న పన్ను భారం 7.1 శాతానికి పడిపోయే సూచనలు




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ప్రతిపాదిత జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వస్తే తెలంగాణలోని కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం ఉందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్ఎస్) తన అధ్యయనంలో వెల్లడించింది. అయితే, ఈ విధానం ప్రజల వద్ద అదనపు నగదును మిగిల్చే కంటే, పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి వారికి పాక్షిక రక్షణ కల్పించేందుకే ఎక్కువగా దోహదపడుతుందని నివేదిక స్పష్టం చేసింది. సెస్ అంచనాల ప్రకారం, జీఎస్టీ 2.0 అమలైతే తెలంగాణ కుటుంబాలపై ప్రస్తుతం 5.4 శాతం నుంచి 10.4 శాతంగా ఉన్న పన్ను భారం, 3.9 శాతం నుంచి 7.1 శాతానికి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆహార పదార్థాలపై పన్ను భారం గణనీయంగా తగ్గుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ఆహారం వస్తువులపై ప్రస్తుతం 2.2 శాతం నుంచి 7.4 శాతం వరకు ఉన్న పన్ను, కొత్త విధానంలో 0.9 శాతం నుంచి 3.4 శాతానికి పడిపోవచ్చని వివరించింది. అదే విధంగా, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలపై పన్ను సుమారు 13 శాతం నుంచి 4–5 శాతానికి దిగివస్తుందని నివేదిక అంచనా వేసింది. ఇప్పటికే ఆహార ధరలు సుమారు 17 శాతం మేర పెరిగిన నేపథ్యంలో, ఈ పన్ను తగ్గింపు సామాన్యులకు ఊరటనిచ్చే కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ కొత్త విధానం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని అధ్యయనం వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని అత్యల్ప ఆదాయ వర్గాలపై పన్ను భారం 10.4 శాతం నుంచి 7.2 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 9.5 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. మహిళలు నేతృత్వం వహించే కుటుంబాలపై కూడా పన్ను భారం తగ్గే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ, సీతక్క

**మొదటిపేజీ తరువాయి..** సురేఖ హాజరు కాకపోవడమే. స్థానిక పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో సురేఖ వర్గానికి తీవ్ర విభేదాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో రేవూరిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం కోరడంతో, ఆయనకే మళ్లీ టికెట్ అనే సంకేతాలు వెళ్లాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొండా సురేఖ కుమార్తె సుస్మిత గీసుకొండలో ప్రత్యేక సభ పెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడంతో పాటు రాబోయే ఎన్నికల్లో తాను పరకాల నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. సీఎంపై నేరుగా జరిగిన ఈ విమర్శలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించి పీసీసీ క్రమశిక్షణ కమిటీ ద్వారా కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె చేసిన కామెంట్లకు తాను బాధ్యురాలిని కానని సురేఖ వివరణ ఇచ్చినప్పటికీ, ఆమెపై కేబినెట్ నుంచి వేటు పడే అవకాశం ఉందనే ఊహాగానాలు జోరుగా సాగాయి. ఇలాంటి తీవ్ర ఉత్కంఠ వాతావరణంలో, రాఖీ పండుగ సందర్భంగా కొండా సురేఖ నేరుగా సీఎం నివాసానికి వచ్చి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం ద్వారా వివాదాలకు స్వస్తి చెప్పి రాజీ మార్గాన్ని ఎంచుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

**మొదటిపేజీ తరువాయి..** నేపాల్–టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు–రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

**మొదటిపేజీ తరువాయి..** రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది. రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సుల్లో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

# ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?
## - కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్

**మొదటిపేజీ తరువాయి..** జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్–1, ఫేజ్–2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

# హైదరాబాద్‌లో భూమి ధరల కొత్త రికార్డు.. ఎకరం రూ.269 కోట్లు!

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. రాయదుర్గంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇనఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. హైదరాబాద్ ఐటీ హబ్, గచ్చిబౌలి, నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ గిరాకీని ఆదాయంగా మార్చుకునే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలానికి రియల్ ఎస్టేట్ రంగం నుంచి భారీ స్థాయిలో స్పందన లభిస్తోంది.

# నేపాల్ వలస కూలీకి ఖమ్మంలో అన్నం పౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి



**ఖమ్మం, ఆగష్టు 28, నేటి శుభోదయ :**
ఇటీవల ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని బోనకల్ మోటమర్రి రైల్వేస్టేషన్లో మధ్యలో నేపాల్ దేశం కైలాలీ జిల్లా కి చెందిన భారత్ ధమాయి (45) సంవత్సరాలు నేపాల్ నుండి చెన్నె రైల్లో వెళుతూ గత మూడు రోజుల క్రితం మృతి చెందారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురికి తరలించిన రైల్వే పోలీస్ వారు మృతదేహం దగ్గర నేపాల్ దేశ పౌరసత్వం ఆధారంగా కుటుంబ సభ్యులకి సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు ఖమ్మం రైల్వే పోలీస్ వారి వద్దకు చేరుకొని మృతదేహాన్ని గుర్తుపట్టి మృతదేహం నేపాల్ దేశానికి తీసుకెళ్లే ఆర్థిక స్తోమత లేక ఖమ్మంలోనే ఖననం చేయుటకు పోలీస్ వారి ద్వారా అన్నం పౌండేషన్ ని సంప్రదించి అంత్యక్రియలు చేయమని కుటుంబ సభ్యులు పోలీసు వారు అన్నం ఫౌండేషన్ కి అభ్యర్థించారు. అన్నం ఫౌండేషన్ మృతదేహాన్ని రైల్వే పోలీసులు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ రెడ్డి, మార్చురీ సిబ్బంది కుటుంబ సభ్యుల సమక్షంలో మార్చురి నుండి స్వాధీనం చేసుకొని నేపాల్ దేశ ఆచార ప్రకారం కుటుంబ సభ్యుల సమక్షంలో తెల్ల వస్త్రం తో చుట్టి పూలు పూలదండలతో గౌరవించి బల్లేపల్లి వైకుంఠ దామానికి తరలించి దహన సంస్కారం చేసిన అన్నం ఫౌండేషన్ నిర్వహికులు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# రెజొనెన్స్ శ్రీనివాస నగర్ స్కూల్ లో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



**ఖమ్మం, ఆగష్టు 28 , నేటి శుభోదయ :**
ఖమ్మం శ్రీనివాస నగర్ లో గల పాఠశాలలో శుక్రవారం ఘనంగా రక్షా బంధన్ వేడుకలు ఎంతో ఉత్సాహంతో జరుపు కున్నారు. విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి ఒకరికి ఒకరు రక్షా బందన్ శుభాకాంక్షలు తెలుపుతూ రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల డైరెక్టర్ ఆర్ వి నాగేంద్ర కుమార్, నీలిమ మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ళ మధ్య అనుభందాన్ని చాటే పండుగ రాఖి పండుగ. రాఖి అంటే రక్షణ అని బంధన్ అంటే కట్టడం అని అర్థం అన్నా, తమ్ములు విజయం వైపు అడుగులు వెయ్యాలని ఉన్నత శిఖరాలు చేసు కోవాలని రాఖి కడుతుంది. సోదరుడు సోదరికి ఏ కష్టమైన అండగ నిలుస్తాడని హామీ ఇస్తూ తనను సంతోష పెట్టడానికి చిరు కానుకలు కూడా అందిస్తూ, అక్షింతలు చల్లుతూ ఆశీర్వ దీస్తారు. అన్నంటే అమ్మ లో మొదటి సగం నాన్నలో రెండవ సగం అన్నా చెల్లెళ్ళ అనురాగానికి గుర్తే రక్షా బంధనం అని విద్యార్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకను ఘనంగా జరుపుకున్నారు.

# తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్ పై నీలాప నిందలు వేయడం కవితమ్మకు తగదు

- **ఖమ్మం అర్బన్ జిల్లా కార్పొరేషన్ ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ సంఘ నాయకులు కోసూరి ప్రసాద్**



**ఖమ్మం, ఆగష్టు 28, నేటి శుభోదయ :**
జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కోసూరి ప్రసాద్ జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. భారత రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవ రాజు శ్రీనివాస్ స్వగ్రామం మధిర నియోజకవర్గం, ఎర్రుపాలెం మండలం చోపకట్లపాలెం అని ఆయన విద్యాభ్యాసం అంతా తెలంగాణలోనే అని ఎవరో వ్రాసి ఇచ్చిన స్క్రిప్ట్ చదివిన మీరు స్క్రిప్ట్ ను క్షుణ్ణంగా పరిశీలించి మాట్లాడి ఉంటే బాగుండేదని హితవు పలికారు. భారత రాష్ట్ర సేన అధ్యక్షులుగా ఉన్న కవితమ్మ మీకు ప్రజా ప్రతినిధిగా ఎంతో అనుభవం ఉన్న మీరు నిజా నిజాలు తెలుసు కోకుండా మాట్లాడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. బసవరాజు శ్రీనివాస్ తెలంగాణ వాసి అని ముఖ్యంగా మా ఖమ్మం ప్రాంత వాసి అని మీకు ఆయనకు సంబంధించి ఎటువంటి ఆధారాలు కావాలన్నా మీకు ఇవ్వటానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.అదేవిధంగా ఆయన యస్ సి ఆడపడుచులను విమర్శించారని అనటం విడ్డూరంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు వనం కృష్ణవేణి,కలవల శ్రీనివాస్,ఊటుకూరు చక్రధర్ రావు, ఏడునూతల ప్రభాకర్ రావు , మేడికొండూరు ప్రసాద్, ఉన్నకోట సంతోష్, అయ్యదేవరరాంగోపాల్, ఏడునూతలఉదయ్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ధర్మపల్లి—సిరికొండలో ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు







**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి , ఆగష్టు 28, నేటి శుభోదయ :**
శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ధర్పల్లి, సిరికొండ మండల కేంద్రాల్లో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘ భవనాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, సంఘ సభ్యులు సంప్రదాయబద్ధంగా జంధ్యాలను ధరించారు. అనంతరం పరస్పరం రాఖీలు కట్టుకుని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆయా సంఘ భవనాల్లో పండుగ సందడి నెలకొంది. సోదరభావం, ఐక్యతను చాటుతూ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. జంధ్యాల పౌర్ణమిని నూలు పౌర్ణమి అని కూడా పిలుస్తారని, ఇది పద్మశాలి సమాజానికి ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన పర్వదినమని సభ్యులు తెలిపారు. సిరికొండలో జరిగిన కార్యక్రమంలో భూమేశ్వర్, రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ, పద్మశాలి కుల బాంధవుడు భక్త మార్కండేయ మహర్షి చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లో పద్మశాలి సంఘాల నాయకులు, సభ్యులు, మహిళలు, యువతతో పాటు పలువురు సంఘ పెద్దలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# హుస్సేన్‌నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 28, నేటి శుభోదయ :**
సిరికొండ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు మరింత సులభంగా అందనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినందుకు గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ రమేష్, గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు జీవన్ రెడ్డి, కారోబార్ పండరి, జయంతి మేడం, రేషన్ డీలర్ రాజారెడ్డితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి సందడి.. సిరికొండ ప్రధాన కూడలిలో పెరిగిన రద్దీ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 28, నేటి శుభోదయ :**
రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిరికొండ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి సందడిగా మారింది. అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి బయలుదేరిన ఆడపడుచులతో పాటు పండుగకు అవసరమైన వస్తువుల కొనుగోళ్ల కోసం వచ్చిన ప్రజలతో ప్రధాన కూడలిలో రద్దీ నెలకొంది.రాఖీ పండుగ నేపథ్యంలో పట్టణంలోని దుకాణాలు, చిరువ్యాపార కేంద్రాల వద్ద ప్రజల సందడి కనిపించింది. ముఖ్యంగా రాఖీలు, పూజా సామగ్రి, స్వీట్లు, పండ్లు, ఇతర పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ప్రధాన కూడలిలో వాహనాల రాకపోకలు కూడా పెరిగాయి.అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ పండుగ సందర్భంగా సిరికొండలో పండుగ వాతావరణం నెలకొంది.

# లోపలికోట హనుమాన్ మందిరంలో యజ్ఞోపవితం.

- **ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్.**



**సంగారెడ్డి,ఆగష్టు 28, నేటి శుభోదయ**
రక్షాబంధన్ సందర్భంగా సదాశివపేట లోపలి కోట హనుమాన్ మందిర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యజ్ఞోపవిత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా లోపలి కోట కుల బాంధవులు యజ్ఞోపవిత కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి, అనంతరం జంజిరాలు మార్చుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలోనాగారం పెంటయ్య, బిట్ల ప్రేమ్ కుమార్, మునిపల్లి రామకృష్ణ, పోల పెద్ద సిద్ధిరాములు, మెడికల్ శ్రీనివాస్, పద్మ గణేష్, పద్మ మల్లేశం, పోల శంకర్, మీనుపూరి లింగం, కోట రాజేష్, పోల సంగమేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు లోపలి కోట వాసులు తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్ మండలంలో ఘనంగా రాఖీ పండుగ



**షాబాద్, ఆగస్ట్ 28, నేటి శుభోదయ :**
షాబాద్ మండలంలో రాఖీ పండుగను ప్రజలు శుక్రవారం ఘనంగా జ రుపుకున్నారు. ప ండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరుల ఇళ్లకు చేరుకుని ప్రేమాభిమానాలతో రాఖీలు కట్టారు. సోదరుల నుదుటన తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు.అనంతరం సోదరులు తమ సోదరీమణులకు బహుమతులు అందజేసి, జీవితాంతం వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరడంతో గ్రామాలు, పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు రాఖీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను చాటిచెప్పే రాఖీ పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు సోదరి రాఖీ



**సంగారెడ్డి , ఆగస్టు 28, నేటి శుభోదయ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ఆయన సోదరి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు నిర్వహించారు.సోదరి రాఖీ కట్టడంతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేసి, సోదరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సోదర, సోదరీమణుల ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆత్మీయ బంధమే రక్షాబంధన్.




**ఏన్కూర్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలను అత్యంత వైభవంగా సోదర సోదరీమణులు ఉత్సాహంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ అన్నదమ్ముల క్షేమం కోరుతూ తిలకం దిద్ది , స్వీట్లు తినిపించి రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకొని శుభాకాంక్షలు తెలిపారు.రక్షాబంధన్ మన కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రేమ, ఆప్యాయత అన్నదమ్ముల పరస్పర రక్షణ ప్రతీకగా నిలుస్తుందని ,రాఖీ అంటే కేవలం చేతి కట్టే ఒక నూలు దారం కాదని అది ఒక ప్రేమ ఆత్మీయత . అన్నదమ్ములు, అక్క చెల్లె ల ను జీవితాంతం గౌరవిస్తూ అవసరమైనప్పుడు అండగా నిలబడి ఉంటానని భావన వ్యక్తం అవుతుంది. ఆత్మీయ బంధాలను కలిపే పండగే రక్షాబంధన్. మండల వ్యాప్తంగా ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## పత్తి చెట్టుకు రాఖీ కట్టి అభిమానం చాటుకున్న రైతు..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / టేకులపల్లి, ఆగస్టు 28, నేటి శుభోదయ :** రక్షాబంధన్ సందర్భంగా పత్తి పంటపై తనకున్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు బానోత్ రవి. మొక్కంపాడు తండాలో రైతు గవాస్కార్‌తో కలిసి తాను సాగు చేస్తున్న పత్తి చేనులోని పత్తి మొక్కకు రాఖీ కట్టి రైతు జీవితం, పంటలతో తనకున్న అనుబంధాన్ని చాటుకున్నారు.రైతు కష్టానికి ప్రతీకగా నిలిచే పత్తి మొక్కను సోదరుడిగా భావించి రాఖీ కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అన్నదాతకు అండగా నిలవడంతో పాటు రైతులు పండించే పంటలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రవి పేర్కొన్నారు.పత్తి పంటను కేవలం పంటగా కాకుండా తమ జీవనాధారంగా భావిస్తామని, పంటకు రాఖీ కట్టడం రైతుల శ్రమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు.రైతు–పంట–సమాజం మధ్య ఉన్న అనుబంధాన్ని చాటిన ఈ వినూత్న రాఖీ వేడుక స్థానికంగా ఆకట్టుకుంది.

## సీఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు

- **పవన సుత రైస్ మిల్ రూ.12.28 కోట్ల డిఫాల్ట్**
- **డిఫాల్ట్ మిల్లర్‌తో పాటు ట్రక్ చిట్టీల్లో సంతకాలు చేసిన మరో వ్యక్తిపై కేసు నమోదు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**మంథని /పెద్దపల్లి, ఆగస్టు 28, నేటి శుభోదయ :** మంథని మండలంలోని పవన సుత రైస్ మిల్ సీఎంఆర్ బియ్యం డిఫాల్ట్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.మంథనిలోని రావికంటి పవన్ కుమార్ యాజమాన్యంలోని పవన సుత రైస్ మిల్‌కు ఖరీఫ్, రబీ 2021–22 సీజన్లలో మొత్తం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, దానికి సమానంగా 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉందని తెలిపారు. అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,069.380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐ/టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించారని పేర్కొన్నారు. దీంతో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉన్నట్లు తెలిపారు. ఇది 4,211.813 మెట్రిక్ టన్నుల సమాన ధాన్యానికి సమానమని, దీని విలువ రూ.9,82,51,492గా ఉందని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ రూ.2,45,62,873 కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం రూ.12,28,14,365గా నిర్ధారించినట్లు తెలిపారు. రబీ 2021–22కు సంబంధించి పవన సుత రైస్ మిల్లుకు అప్పగించిన ధాన్యాన్ని మంథనిలోని శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం సూరయ్య పల్లి మిల్లుకు తరలించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పీపీసీల ద్వారా సమర్పించిన ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను అధికారులు పరిశీలించగా, శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం, సూరయ్యపల్లికి చెందిన భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ సంతకాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యం స్వీకరణ, అంగీకారానికి సంబంధించిన ట్రక్ చిట్టీల్లో నవీన్ కుమార్ సంతకాలు ఉన్న నేపథ్యంలో ఆయన పాత్రపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.పవన సుత రైస్ మిల్ యాజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్‌కు పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు, రికవరీ తదితర చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

## అద్భుతంగా ట్రైబల్ మ్యూజియం.

### - చత్తీస్‌గఢ్ రిటైర్డ్ ఎస్ఎస్‌సీఎల్ సూపర్‌వైజర్ హరిలాల్ సింగ్..





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియం గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా అద్భుతంగా ఉందని చత్తీస్‌గఢ్ రాష్ట్రం ఎస్ఎస్‌సీఎల్ సర్వే విభాగం రిటైర్డ్ సూపరవ ైజర్ హరిలాల్ సింగ్, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలానికి చెందిన పెళ్లి బృందం సభ్యులు ప్రశంసించారు. శుక్రవారం వారు ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించారు. మ్యూజియం లోని వివిధ కళాఖండాలు, పురాతన వస్తువులను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో వివాహం నిర్వహించి, స్వామివారి దర్శనం అనంతరం గిరిజన సంస్కృతికి సంబంధించిన మ్యూజియం ఉందని తెలుసుకుని సందర్శించినట్లు తెలిపారు.మ్యూజియం ప్రవేశ ద్వారం వద్దే వివిధ కళాఖండాలతో ఏర్పాటు చేసిన అలంకరణలు ఆకట్టుకుంటున్నాయని అన్నారు. మ్యూజియం ఆవరణలో గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నిర్మించిన పాతకాలపు ఇళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నారుల కోసం క్రీడా స్థలం, యువత కోసం బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.మ్యూజియానికి మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా నూతన డిజైన్లు, ప్రత్యేక ఆకర్షణలను ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శకుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వారి సూచనలకు అనుగుణంగా మ్యూజియాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు.మ్యూజియం ఏర్పాటు చేసిన విధానం, నిర్వహణ, సిబ్బంది అందిస్తున్న సమాచారం, ప్రదర్శనలో ఉంచిన కళాఖండాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసేలా మ్యూజియం ఏర్పాటు చేసిన ఐటీడీఏ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇన్‌చార్జి ప్రభాకర్‌రావు, మాధవి, సలీం తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హామీలను వెంటనే అమలు చేయాలి



**మల్కాజిగిరి, ఆగస్టు 28, నేటి శుభోదయ :** ఎన్నికల సమయంలో వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో సమితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎన్. వినయ్ మాదిగ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎం.జె.ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎన్. వినయ్ మాదిగ మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల సాధన కోసం మందకృష్ణ మాదిగ 19 ఏళ్ల క్రితం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. ఈ ఉద్యమం ద్వారా వికలాంగులకు అనేక హక్కులు, సంక్షేమ ప్రయోజనాలు సాధించామని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పెన్షన్‌ను పెంచి వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న విధంగానే వికలాంగులకు కూడా వారి జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వికలాంగులకు దక్కాల్సిన హక్కులు, వాటా సాధించే వరకు భవిష్యత్తులోనూ ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్, బి. రజిత, ఎం. వెంకటేష్, బి. నరసింహ, ఈశ్వరయ్య, అజీరా బేగం, సూరజ్, ప్రకాష్, ఎస్. కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు, క్రమశిక్షణతోనే యువతకు ఉజ్వల భవిష్యత్






**మేడ్చల్–మల్కాజిగిరి, ఆగస్టు 28, నేటి శుభోదయ :** క్రీడలు, ఫిట్‌నెస్, క్రమశిక్షణతో యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని మై భారత్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం–2026 సందర్భంగా మై భారత్, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు విద్యాసంస్థల్లో శుక్రవారం 'ఖేలో ఇండియా డైలాగ్–ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, యువత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో నిర్వహించిన ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశంలో భారత క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభను గుర్తించడం, ఫిట్‌నెస్, క్రమశిక్షణతో పాటు దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలను వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి. సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని సూచిస్తూ యువతను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. నాగుల వేణు, డా. డి. పద్మ, డా. ఎ. గోపాల్ పాల్గొన్నారు.మేడ్చల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణ, స్విమ్మర్లు విష్ణు వర్ధన్, వర్షిత్ ధులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధ, పి.వి. నాగలక్ష్మి (ఏటీపీ), ప్రతిభ (డీడబ్ల్యూ), ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఇ. నాగలక్ష్మి హాజరయ్యారు.కార్యక్రమాలను మై భారత్ ప్రతినిధులు కిరణ్‌కుమార్ కందుకూరి, ఎ. హర్షిత రెడ్డి, ఇ. వికాస్ సమన్వయం చేశారు. క్రీడలు, ఫిట్‌నెస్, స్వచ్ఛంద సేవ, నాయకత్వం, అనుభవాధారిత అభ్యాసం ద్వారా యువతను శక్తివంతం చేసి వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధనలో భాగస్వాములను చేయడమే కార్యక్రమ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, నాయకత్వం, అనుభవాధారిత అభ్యాసం, దేశ నిర్మాణానికి సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్–2027లో చురుగ్గా పాల్గొని తమ ఆలోచనలు, ప్రతిభ, శక్తిని దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు.

# మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ డబ్ల్యూ జె గౌరవ అధ్యక్షునిగా కొండేలా మారుతి



**మంథని, ఆగస్టు 28, నేటి శుభోదయ :** మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ డబ్ల్యూజే గౌరవ అధ్యక్షునిగా కొండేలా మారుతి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోతుకూరి శ్రీనివాస్, గడిపల్లి అజయ్ శుక్రవారం ప్రకటించారు. పత్రిక రంగంలో అపార అనుభవం కలిగి, సామాజిక సేవా రంగంలో విశేష అనుభవం కలిగి సేవలు అందిస్తున్న కొండేల మారుతి నియామకం పట్ల మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ (డబ్ల్యూ జె )సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కొండేల మారుతి అనుభవాలు ఆలోచనలు తమకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

# పోతునూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 28, నేటి శుభోదయ :** సిరికొండ మండలం పోతునూరు గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మార్వో రవీందర్ రావు, గ్రామ సర్పంచ్ మహిపాల్ యాదవ్, ఉప సర్పంచ్ రాజలింగం, జీపీఓ నవీన్ కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో రవీందర్ రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలు డిజిటల్ విధానంలో అందుబాటులో ఉండటంతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరగడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# మదర్ థెరిస్సా పొదుపు సమితి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలి

## - నామని హరీష్



**మంథని, ఆగస్టు 28, నేటి శుభోదయ :** మంథనిలోని మదర్ థెరిస్సా మహిళా పొదుపు సమితి (రిజిస్టర్ నంబర్ ఎం.సి/బి.సి.ఓ/కెఎన్ఆర్/2002/1346) లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపించాలని గంగాపురికి చెందిన నామని హరీష్ కోరారు. సమితి ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకతపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో చట్టపరమైన విచారణ చేపట్టాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.సమితికి సంబంధించిన అనుమతులు, నిబంధనలు, సంస్థ ప్రారంభమైన తేదీ నుంచి ఇప్పటివరకు ఉన్న సభ్యుల సంఖ్య, పొదుపు లావాదేవీలు, రుణాల మంజూరు, వడ్డీ వసూళ్ల వివరాలను వెల్లడించాలని ఆర్టీఐ దరఖాస్తులో కోరినట్లు తెలిపారు. సమితి లావాదేవీలకు సంబంధించి క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాన్ని కూడా స్పష్టం చేయాలని కోరారు. సమితి ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

## : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**రాజేంద్రనగర్,ఆగస్టు28, నేటి శుభోదయ :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం,మతం,రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం,సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ మైలార్దేవ్పల్లి శ్రీలక్ష్మి భవనం పొదుపు సంఘంలో పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు డ్రా పద్ధతితో ఇండ్లను అలాట్మెంట్ చేశారు.మొత్తం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 480 అన్ని వర్గాల కేటగిరి చెందిన వారందరికీ ఇండ్లను కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పేద ప్రజల సంక్షేమ కృషికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్లను అన్ని వర్గాల ప్రజలకు అందజేస్తుందని ఆయన తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ కృషికి నిరంతరం కృషి చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తారని ఆయన అన్నారు. సమస్య ఏమైనా ఉంటే దగ్గరుండి సమస్యకు పరిష్కారం చూపుతానని ఆయన పేర్కొన్నారు.సంవత్సరంలోపు ఇందిరమ్మ ఇండ్ల టవర్ అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా రక్షాబంధన్ వేడుకలు

## - అన్నాచెల్లెల్ల ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్



**నేరేడ్ మెట్ , ఆగస్టు 28, నేటి శుభోదయ :** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మల్కాజిగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మల్కాజిగిరి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆశ ఆధ్వర్యంలో గుండా నిరంజన్‌కు మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముస్లిం మహిళలు సైతం రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొని గుండా నిరంజన్‌కు రాఖీలు కట్టారు. అనంతరం స్వీట్లు పంచుకుని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుండా నిరంజన్ మాట్లాడుతూ.. రాఖీ పండుగ కులమతాలకు అతీతంగా ప్రజలను ప్రేమానురాగాలతో కలుపుతుందని అన్నారు. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ఆప్యాయత, అనురాగాలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యూసుఫ్, మల్కాజిగిరి మహిళా కాంగ్రెస్ నాయకురాలు భాగ్యలక్ష్మి , జన, చైతన్య, చిన్న రాణి, రోజా రమణి, జిన్ని, మహాలక్ష్మి , అనిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రక్షణగా ఉండాలని పోలీసులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్





**రాజేంద్రనగర్,ఆగస్టు 28, నేటి శుభోదయ :** శంషాబాద్ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ఆర్ జి ఐఏ పోలీస్ స్టేషన్ ఏసిపి శ్రీకాంత్ గౌడ్,ఎస్సై హర్షద్ అలీలకు ఎస్ఎఫ్ఐ నాయకులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఆడపిల్లలను పుట్టనిద్దాం..చదవనిద్దాం..ఎదగనిద్దాం"అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆడపిల్లల రక్షణ,విద్య,సమాన అవకాశాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. సమర్పించిన వినతిపత్రాలపై హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**మేడ్చల్–మల్కాజిగిరి, ఆగస్టు 28,నేటి శుభోదయ :**
జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మూడు రోజుల పాటు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఆగస్టు 28 నుంచి 30 వరకు వేడుకలు కొనసాగనున్నాయి.వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి వై. దామోదర్ రెడ్డి, క్రీడా సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడా రంగానికి మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్‌తో పాటు క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అధికారులు సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు.

## బాలసదనం పిల్లలకు కలెక్టర్ ఆత్మీయ ఆతిథ్యం



**మేడ్చల్–మల్కాజిగిరి, ఆగస్టు 28, నేటి శుభోదయ :**
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో ప్రభుత్వ బాలసదనం బాలబాలికలు కలెక్టర్ మను చౌదరికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.బాలసదనం పిల్లల కోసం ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసిన కలెక్టర్.. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం స్వీట్లు, కొత్త దుస్తులను అందజేశారు. పిల్లల చదువు, ఆరోగ్యం, సంక్షేమానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద, బాలల భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్ రహీం తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్‌తో కలిసి భోజనం చేసి, కొత్త దుస్తులు, స్వీట్లు అందుకోవడంతో బాలసదనం పిల్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

## సోదరానుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు



**నేరెడ్ మెట్ (కౌకూర్ ), ఆగస్టు 28 , నేటి శుభోదయ :**
యాప్రాల్ డివిజన్ కౌకూర్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. కాలనీకి చెందిన మహిళలు, అక్కాచెల్లెళ్లు, తల్లులు కలిసి తూడిమెళ్ల మల్లికార్జున్‌కు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. రాఖీ కేవలం ఒక దారం కాదని, సోదరానుబంధానికి ప్రతీక అని అన్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీతో తనకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని, కాలనీలోని ప్రతి ఒక్కరూ తన కుటుంబ సభ్యులేనని పేర్కొన్నారు. కష్టసుఖాల్లో తనకు అండగా నిలిచిన కాలనీ వాసులు రాఖీ ద్వారా చూపిన ప్రేమ, నమ్మకాన్ని ఎప్పటికీ మరువబోనన్నారు. సోదరుడిగా కాలనీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి రక్షణతో పాటు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.మహిళలు మాట్లాడుతూ.. మల్లికార్జున్ తమకు కేవలం నాయకుడు కాదని, కుటుంబ సభ్యుడిగా ఆప్యాయంగా ఆదుకుంటారని అన్నారు. ఏ అవసరం వచ్చినా సోదరుడిలా అండగా నిలుస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## భద్రాచలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు,...

### - 30 కిలోల ఆహార పదార్థాలు డిస్కార్డ్.. 15 దుకాణాల్లో తనిఖీలు...



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 28,నేటి శుభోదయ :**
భద్రాచలం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఈ. శరత్ ఆధ్వర్యంలో కిరాణా దుకాణాలు, జనరల్ స్టోర్స్, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సుమారు 15 దుకాణాల్లో మిఠాయిలు, క్యాండీలు, ప్యాకేజ్డ్ ఫుడ్ తదితర ఆహార పదార్థాల నాణ్యత, ప్యాకింగ్, లేబులింగ్, గడువు తేదీలు, నిల్వ విధానాలను పరిశీలించారు. నాణ్యతపై అనుమానం ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు.నిబంధనలకు విరుద్ధంగా, వినియోగానికి అనర్హంగా ఉన్న సుమారు 30 కిలోల ఆహార పదార్థాలను గుర్తించి డిస్కార్డ్ చేయించారు.నిబంధనలు పాటించాలీఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ ఫుడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని అధికారులు సూచించారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయడంతో పాటు ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఈ. శరత్ తెలిపారు.

## 129 మంది ఓటర్ల మ్యాపింగ్ వ్యత్యాసాలకు చెక్!

### - పోతూ్నర్‌లో ఆధారాల పరిశీలన.. ఆన్‌లైన్‌లో వివరాల అప్‌డేట్

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 28, నేటి శుభోదయ :**
జిల్లా ఎన్నికల అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు సిరికొండ మండలం పోతూ్నర్ గ్రామంలో ఓటర్ల మ్యాపింగ్‌కు సంబంధించిన వ్యత్యాసాలను సరిచేసే ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బంది గ్రామంలో ఓటర్ల వివరాలను పరిశీలించి, మ్యాపింగ్‌కు సంబంధించిన అవసరమైన సవరణలు, అప్‌డేట్లు చేపట్టారు.మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా పోతూ్నర్ గ్రామానికి చెందిన 129 మంది ఓటర్లకు నోటీసులు రావడంతో, వారికి సంబంధించిన ఆధారాలను అధికారులు పరిశీలించారు. అనంతరం అవసరమైన పత్రాలు, వివరాలను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసి ప్రక్రియను పూర్తి చేశారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా, మ్యాపింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్పంచ్ మహిపాల్, ఉప సర్పంచ్ రాజలింగం, బీఎల్‌ఓ లింబా రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, పోతూ్నర్ గ్రామ పాలనా అధికారి నవీన్, ఇతర గ్రామ పాలనా అధికారులు పాల్గొన్నారు. సంబంధిత ఓటర్ల నుంచి అవసరమైన ఆధారాలను సేకరించి



ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో మ్యాపింగ్‌కు సంబంధించిన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

## కంది పంట సాగుపై ప్రత్యేక శిక్షణ, ఇన్‌పుట్స్ పంపిణీక కార్యక్రమం

### - మండల వ్యవసాయ అధికారి దండెం విజయ్ చంద్ర

**షాబాద్, ఆగస్ట్ 28, నేటి శుభోదయ :**
షాబాద్ రైతు వేదికలో ఆగస్టు 29న ఉదయం 10 గంటలకు మిషన్ ఫర్ ఆత్మనిర్భర్త ఇన్ పల్సెస్ (MANP)–2026–27 పథకంలో భాగంగా కంది పంట సాగుపై ప్రత్యేక శిక్షణ, ఇన్‌పుట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి దండం విజయచంద్ర తెలిపారుమండలంలోని 7 గ్రామాల్లో 85 హెక్టార్ల విస్తీర్ణంలో కంది పంట బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్/క్లస్టర్ ఆధారిత ప్రదర్శనను చేపట్టడం జరిగిందని ఇందులో భాగంగా LRG–133–33 రకం ధృవీకరించిన నాణ్యమైన కంది విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించినట్టు తెలిపారుఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని కనుక జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు,రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు



## వికలాంగుల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తాం

### - హామీలు అమలు చేయాలి: వంగూరి ఆనందరావు మాదిగ

**వరంగల్, ఆగస్ట్ 28, నేటి శుభోదయ :** వరంగల్ జిల్లా కేంద్రంలోని కాశీబుగ్గ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఐత చంద్రమౌళి మాదిగ అధ్యక్షతన వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి సీనియర్ నాయకులు కన్నూరి చంద్రశేఖర్ మాదిగ జెండాను ఆవిష్కరించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన పోరాటాల ఫలితంగానే వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్లలో పెరుగుదల సాధ్యమైందన్నారు.తెలంగాణలో వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేస్తే భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో



గంగారపు మల్లన్న మాదిగ, కన్నెబోయిన ప్రమోద్ మాదిగ, ఇసంపల్లి ప్రశాంత్ మాదిగ, దౌడు నరేష్ మాదిగ, కల్లేపల్లి సామేలు, కొమరయ్య మాదిగ, సూరన్న మాదిగ, దౌడు భాస్కర్ మాదిగ, ఇమ్మడి రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# రస్టీ స్పాటెడ్ క్యాట్ అనే జాతి పిల్లి మృతి

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఆగస్టు 28, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా, ఆర్మూరు అటవీ డివిజన్ పరిధిలోని, సిరికొండ రేంజ్ లోని హుస్సేన్ నగర్ బీట్ కంపార్ట్మెంట్ నెంబరు 408 లో రోడ్డు ప్రక్కన బొడ్డు మామిడి చెరువు ప్రాంతంలో ఒక పిల్లి జాతి జంతువు మృతి చెందినదని సమాచారం అందినది. ★ అటవీశాఖ అధికారులు ఆ కళేబరాన్ని పరిశీలించగా అది రస్టీ స్పాటెడ్ క్యాట్ (Rusty spotted cat) తుప్పు రంగు మచ్చల పిల్లి అని నిర్ధారించడం జరిగింది. ★ ఈ జంతువు వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూలు – 1 కు చెందినది మరియు అరుదైనది. ★ సిరికొండ అటవీ క్షేత్రాధికారి దీనిని అడవి జంతువు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ★ శవ పంచనామా తదుపరి మృతికి కారణాలు మరియు ఇతర వివరాలను వెల్లడించడం జరుగుతుంది.అటవీశాఖ అధికారుల



విజ్ఞప్తి :-అటవీ ప్రాంతంలో వాహనాలు నడిపే సమయంలో గంటకు 30 కి.మీలకు మించని వేగంతో వాహనాలను నడిపి తగు జాగ్రత్తలు పాటించి ఇటువంటి ప్రమాదాలను నివారించవలసినదని కోరారు

# బోనకల్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మాగి ముఖేష్ ఏకగ్రీవ ఎన్నిక.....

**బోనకల్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** బోనకల్ మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా చోప్పకట్లపాలెం గ్రామానికి చెందిన మాగి ముఖేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువతలో ఉన్న విశేష ఆదరణ, చురుకైన పాత్రే ఆయన ఎన్నికకు ప్రధాన కారణమైంది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎంఎస్పి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోట హనుమంతరావు మాదిగ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి జిల్లా ఇన్చార్జ్ కందికట్ల విజయ్ మాదిగ, ఎంఎస్పీ మాజీ అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య మాదిగ, ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు, మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు.

**- బోనకల్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం...**

1)మండల అధ్యక్షుడు: మాగి ముఖేష్ మాదిగ



2)అధికార ప్రతినిధి: మంద వినోద్ మాదిగ

3)ప్రధాన కార్యదర్శులు: మర్రికంటి గంగాధర్ మాదిగ,

4)మధు మాదిగ

5)ఉపాధ్యక్షులు: చిలక రవికుమార్ మాదిగ, పవన్ కుమార్ మాదిగ

6)కోశాధికారి: మర్రి కిరణ్ కుమార్ మాదిగ

7)కార్యదర్శులు: డేవిడ్ రాజ్ మాదిగ, యంగల నాగరాజ్ మాదిగ, తోటపల్లి సతీష్ మాదిగ మందకృష్ణ మాదిగకు ముఖేష్ కృతజ్ఞతలు తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు, సహకరించిన జిల్లా నాయకులకు నూతన అధ్యక్షుడు మాగి ముఖేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో మాదిగ సామాజికవర్గ హక్కుల పోరాటానికి,



పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు మాదిగ, ఖమ్మం జిల్లా నాయకులు తాటికొండ వెంకటరత్నం మాదిగ,బోనకల్ మాజీ మండల అధ్యక్షుడు బలవంతపు నరసింహారావు మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు తోటపల్లి చిన్న సైదులు మాదిగ, మర్రి కరణం మాదిగ, ప్రభాకర్ రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# హోదా ఏదైనా.. అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

**కేశంపేట, ఆగస్టు 28, నేటి శుభోదయ :** కేశంపేట మండలం మంగళగూడ గ్రామంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అరుదైన ఆత్మీయ సంఘటన చోటుచేసుకుంది. మంగళగూడ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డికి తొమ్మిది రేకుల సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి రాఖీ కట్టి అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్న ఇద్దరు సర్పంచులు, తమ బాధ్యతల మధ్య సమయం కేటాయించి రాఖీ పండుగను ఆత్మీయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానుబంధానికి ప్రతీక అని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆస్తి తగాదాలు, చిన్నచిన్న అపార్థాలతో కుటుంబ సభ్యులు దూరమవుతున్న పరిస్థితుల్లో బంధాలకు విలువనిస్తూ అందరూ అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షించారు. రాఖీ బంధం కేవలం పండుగకే పరిమితం కాకుండా జీవితాంతం ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలవాలని పేర్కొన్నారు. ఇద్దరు సర్పంచుల



మధ్య కనిపించిన ఆత్మీయతను చూసిన గ్రామస్తులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# గణేష్ నవరాత్రుల,నిమజ్జోత్సవాలు శాంతియుతం వాతావరణం జరుపుకుందాం:నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మారెడ్డి.

**రాజేంద్ర నగర్,ఆగస్టు 28, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మారెడ్డి తెలిపారు.శుక్రవారం నార్సింగి సర్కిల్ కార్పొరేషన్ కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.సెప్టెంబర్ 14 నుంచి 11 రోజుల పాటు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు.నెక్నాంపూర్ బేబీ పాండ్,సంజీవరెడ్డి పాండ్,మంచిరేవుల,కొత్త చెరువు,కోకాపేట్,జన్వాడ చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు.నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా,సురక్షితంగా క్రమబద్ధంగా నిర్వహించేందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధుల సూచనలు,అభిప్రాయాలను స్వీకరించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..ఉత్సవాల కావలసిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు.రోడ్లు,వీధి దీపాలు,పారిశుద్ధ్యం లాంటి పనులు సక్రమంగా ఉండేటట్లు



చర్యలు తీసుకోవాలని కోరారు.రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి ప్రతి వీధిలో వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీస్,లా అండ్ ఆర్డర్ పోలీస్,హైడ్ర ,నార్సింగి సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అన్నా–చెల్లెలు, అక్క–తమ్ముళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్



**నాగోల్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** అన్నా–చెల్లెలు, అక్క–తమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగం, రక్షణకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి సందర్భంగా నాగోల్ డివిజన్‌లోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు, సోదరీమణులు విచ్చేసి నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల అరుణ సురేందర్ యాదవ్ గారి నివాసంలో శ్రీ చింతల సురేందర్ యాదవ్ గారికి రాఖీలు కట్టి ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సోదరీమణులకు స్వీట్లు తినిపించి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ ఆత్మీయమైన రాఖీ వేడుకలు అన్నా–చెల్లెలు, అక్క–తమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధాలను మరింత బలోపేతం చేశాయి.ఈ పవిత్రమైన రాఖీ బంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని, ప్రతి అన్న తన సోదరీమణులకు అండగా నిలవాలని, ప్రతి సోదరి తన అన్నకు ప్రేమాభిమానాలతో తోడుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,ఆగస్టు 28, నేటి శుభోదయ :** ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ సీనియర్ నాయకులు గణేష్ గుప్తా ఈ భేటీలో పాల్గొని ముఖ్యమంత్రిని కలిశారు.ఇదొక మర్యాదపూర్వక కలయిక అన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులు,అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారు సానుకూల వాతావరణంలో కాసేపు చర్చించినట్లు సమాచారం.

# కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**- బాలికల రక్షణ, విద్యకు అందరూ తోడ్పడాలి: కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో పాటు అదనపు కలెక్టర్లు, జిల్లా సంక్షేమాధికారి తదితర అధికారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా మాట్లాడి వారి విద్య, లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. అనంతరం బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ బాలికలు కుటుంబానికి, సమాజానికి అమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. ప్రతి బాలికకు భద్రతతో కూడిన వాతావరణం, నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. "బేటీ బచావో – బేటీ పడావో" స్ఫూర్తితో ప్రభుత్వం బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారత కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించిన కలెక్టర్, "బాలికను కాపాడుదాం – బాలికను చదివిద్దాం – బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశాన్ని సమాజానికి ఇచ్చారు.కార్యక్రమంలో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష్ రూప, స్వాతి, ప్రియాంక, మౌనిక, దీప్తి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు







**నాగోల్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** రక్షాబంధన్ (రాఖీ పండుగ) సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పోలీసు సిబ్బందితో కలిసి రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా పోలీసు సిబ్బంది పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పి. శివ నాగ ప్రసాద్, నర్సింహ, ఉమా, మమతతో పాటు మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ మహిళా పోలీసు సిబ్బందిని అభినందించి, వారికి కానుకలు అందజేసి గౌరవించారు.రాఖీ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా సిబ్బంది పేర్కొన్నారు

## నేడే మణికొండలో వాక్ విత్ హైడ్రా.

**రాజేంద్ర నగర్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** నార్సింగి సర్కిల్ 127 డివిజన్ పరిధిలోని మణికొండ లోని వివిధ కాలనీల రెసిడెన్స్ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా రేపు వాక్ విత్ హైడ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా శనివారం ఉదయం ఏడు గంటల కు మణికొండ మర్రిచెట్టు వద్ద నుండి ప్రారంభమై కూడా కార్యనిర్ వరకు ర్యాలీగా కొనసాగఉందని నిర్వాహకులు తెలిపారు.ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలలో ప్రజలు భాగస్వామ్యంలో ఎంతో ముఖ్యమని, మణికొండ లోని పర్యావరణ పరిరక్షణ,చెరువులో నాళాలు సంరక్షణ ఆక్రమణల నియంత్రణ,ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించే చర్యలకు ప్రజల నుంచి మద్దతు ఉండాలని వారు పేర్కొన్నారు.మన మణికొండ- మన బాధ్యత అనే సందేశం తో నిర్వహిస్తున్న ఈ వాక్ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు ప్రజాప్రయోజనాల కోసం చేపట్టి మంచి కార్యక్రమాలకు తమ సంఘీభావాన్ని తెలియజేయడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమానికి మణికొండలోని వివిధ కాలనీలకు చెందిన రెసిడెన్స్,మార్నింగ్ వాకర్లు,యువత మహిళలు పెద్దలు పెద్ద ప్రతి ఒక్కరూ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## రాఖీ పౌర్ణమి వేళ ఆత్మీయ పలకరింపు

### - కలెక్టర్ సత్యశారదకు శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ అయూబ్




**వరంగల్, ఆగస్టు 28, నేటి శుభోదయ** రాఖీ పౌర్ణమి సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ జిల్లా కలెక్టర్ సత్యశారదను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు స్వీట్ అందజేసి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కలెక్టర్ సత్యశారద, మహమ్మద్ అయూబ్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల ప్రేమ, ఆత్మీయతకు రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సోదరులు, సోదరీమణులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీపాద సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు దక్కని ఇందిరమ్మ ఇండ్లు..!

## -అధికార పార్టీ నాయకుల తీరుపై గ్రామస్తుల ఆవేదన



**వికారాబాద్ ఆగస్టు 28, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: అర్హత ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులను పక్కనబెట్టి ఇతరులకు ఇళ్లు మంజూరు చేశారనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు అందుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గ్రామంలో పలువురి ఇళ్లు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇళ్లు మంజూరు చేయడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగానే అర్హులకు అన్యాయం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.అధికార పార్టీకి చెందిన నాయకులు గతంలో వివిధ పదవులు అనుభవించిన గ్రామాల్లోనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందకపోవడం దురదృష్టకరమని స్థానికులు పేర్కొంటున్నారు. రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హత, పేదరికం, ఇంటి పరిస్థితులను ప్రాతిపదికగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని కోరుతున్నారు.అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను పునఃపరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చి, అర్హులందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు

## .5కే భోజనం.. నాణ్యతపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

### - ఎంజీఎం అన్నపూర్ణ భోజన కేంద్రంలో సౌకర్యాల పరిశీలన

**వరంగల్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ఆవరణలో జీడబ్ల్యూఎంసీ సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాన్ని వరంగల్ మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వడ్డింపు విధానం తదితర అంశాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న వినియోగదారులతో మాట్లాడి, భోజనం నాణ్యత, అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.రూ.5కే భోజనం అందించడం ద్వారా ఆసుపత్రికి వచ్చే పేదలు, వారి సహాయకులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని పేర్కొంటూ, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. వంటశాల, భోజన ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, వినియోగదారులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అన్నపూర్ణ కేంద్రం నిర్వహణ, భోజనం నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించా

## అన్నోజిగూడ, పోచారం లలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

### - నారపల్లి విద్యుత్ ఏఈ విక్రమ్ భూక్యా

**ఘట్కేసర్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం నారపల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల అభివృద్ధి, ఆధునీకరణ పనుల నేపథ్యంలో నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ విక్రమ్ భూక్యా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సబ్‌స్టేషన్ అన్నోజిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12:30 గంటల వరకు సాయి సందీప్ కాలనీ , శ్రీకృష్ణ నగర్, అన్నోజిగూడ పాత గ్రామం, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, హనుమాన్ నగర్, ఇందిరా నగర్, సాయి నగర్ కాలనీ, సత్యసాయి హౌసింగ్ కాలనీ, సాయి గణేష్ కాలనీ, సాయి గణేష్ ఎన్‌క్లేవ్, సుముకేశ్ హైట్స్, ఇఫోసిటీ, ప్రేమలత గ్రాండియర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోనుందని అన్నారు. పోచారం సబ్‌స్టేషన్ పరిధిలో ఇన్ఫోసిస్ హాస్టల్ పరిసర కాలనీలు, సెరేనియా హిల్స్, పోచారం గ్రామంలోని శివాలయం పరిసర ప్రాంతం, పోచారం గ్రామం, అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, విజయ్ సాయి ఎన్‌క్లేవ్, గెలాక్సీ టవర్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 2:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు విద్యుత్ అంతరాయం సమయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, వివరాలకు 8712471630, 8712471681 నంబర్లలో సంప్రదించాలని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ విక్రమ్ భూక్యా తెలిపారు.



## మాదిగ పర్వత్తి సంఘం వినతిపై కలెక్టర్‌కు వినతి

### - ఎమ్మెల్యే నాయిని, మాజీ ఎంపీ పసునూరితో కలిసి వినతిపత్రం సమర్పణ



**వరంగల్ , ఆగస్టు 28, నేటి శుభోదయ :** మాదిగ పర్వత్తి సంఘం సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్తో కలిసి సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘానికి సంబంధించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ సంఘం సమస్యలపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.సంఘం ప్రతినిధులు అందజేసిన వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి, న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు నమిండ్ల శ్రీనివాస్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షం అశోక్, టీపీసీసీ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆరూరి సాంబయ్య, టీపీసీసీ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షులు పెరుమాండ్ల రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, తళ్లపెల్లి విజయ్, వరంగల్ ఏనుమాముల మార్కెట్ చైర్మన్ ఎర్ర ప్రియాంక, డా. పులి అనిల్, డా. శ్రవణ్, చిరంజీవి, గోవిందు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీక

### : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **మహిళల రక్షణ, గౌరవం, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**
- **సమాజంలో సోదరభావం, కుటుంబ బంధాలను మరింత పెంపొందించేందుకు రక్షాబంధన్ స్ఫూర్తినిస్తుంది**
- **కలెక్టరేట్ లో రాఖీ కట్టి, మిఠాయి అందించిన బ్రహ్మకుమారీలకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో బ్రహ్మకుమారీలు జిల్లా కలెక్టర్ కు రాఖీ కట్టి, మిఠాయి అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఆప్యాయతలను పెంపొందించేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.సోదరీమణుల రక్షణ, గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం కుటుంబం, సమాజం మొత్తానికి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి హక్కులు, భద్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు.రాఖీ పండుగ కేవలం సోదర, సోదరీమణుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారం, మానవతా విలువలను మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సోదరభావంతో, ఆనందంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు రాజయోగిని, బికె. అరుణ, బికె.గీత తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ రాఖీ కట్టి భారత జాతీయ మహిళా సమైక్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునేశ్వరి.



**రాజేంద్రనగర్,ఆగస్టు28, నేటి శుభోదయ :** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ కు సిపిఐ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ కు బీసీ సంఘం రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు జె సదానంద గౌడ్ కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు చెప్పిన భారత జాతీయ మహిళా సమైక్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునేశ్వరి,మండల సమైక్య నాయకురాలు శాలిని గిరిజన సమాఖ్య జిల్లా కౌన్సిల్ సభ్యులు పద్మ తదితరులు వారి ఫ్యామిలీకి శుభాకాంక్షలు తెలిపారు.

## దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఘనంగా పౌర్ణమి పూజలు









**వికారాబాద్ ఆగస్టు 28, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెలసిన దత్తాత్రేయ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కుల్కచర్ల మండల పరిధిలోని గండి చెరువు–అడవి వెంకటాపూర్ మధ్య పచ్చని ప్రకృతి అందాల నడుమ కొలువుదీరిన ఆలయానికి పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయంలో గణపతి హోమం, మృత్యుంజయ హోమంతో పాటు దత్తాత్రేయ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి, అమ్మవార్లు, కాలభైరవ, పంచముఖ ఆంజనేయ స్వాములను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాల పంపిణీ చేపట్టారు.రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, గణపతి, రుద్ర హోమాలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత కీలకమైనది - కోట నీలిమ

### - కోట నీలిమను కృతజ్ఞతలు తెలిపిన ఎస్ఐఆర్ అబ్జర్వర్లు



**సికింద్రాబాద్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని ఏఐసిసి సభ్యులు, పిసిసి ఉపాధ్యక్షురాలు, సనత్నగర్ నియోజకవర్గ ఇంచార్జి కోట నీలిమ అన్నారు. సనత్నగర్ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దీపక్ జాన్ 8 డివిజన్లకు అబ్జర్వలను నియమించారు. ఇందులో బాగంగా సనత్నగర్ డివిజన్కు బలవంత్ రెడ్డి, బీకే గూడ డివిజను ధనలక్ష్మి , అమీర్పేట్ డివిజన్కు అబ్దుల్ ఆమీల్, ఎస్ఆర్ నగర్ డివిజన్కు బంగారు సదానంద్, బేగం పేట డివిజను సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళి ఆలయ ధర్మకర్త దేవి వరప్రసాద్, రాంగోపాల్పేట్ డివిజను కు శామ్సంన్ రాజు, బన్సీలాల్పేట్ డివిజన్కు సునీల్, పద్మారావు నగర్ డివిజన్కు సరితలను అబ్జర్వర్లుగా నియమించారు. ఈ సం దర్భంగా నూతనంగా అబ్జర్వర్లు శుక్రవారం కోట నీలిమను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించినందుకు కోట నీలిమకు, డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్లకు ధన్యవాదాలు తెలి పారు. ఈ సందర్భంగా 'నీలిమ మాట్లాడుతూ.... నూతన అబ్జర్వర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ డివిజన్లలో పూర్తి సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితలో ఉండేలా చూపడాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం నూతన అబ్జర్వర్లు మాట్లాడుతూ... తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తామని, తమకు కేటాయించిన డివిజన్లలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడటం డూప్లికేట్ ఓట్ల గుర్తింపు, ప్రజలకు అవగాహన కల్పించడం, బిఎల్ఎలు, సూపర్వైజర్లు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

## 1955 నాటి జీ.హెచ్.ఎం.సీ చట్టం స్థానంలో 2026 కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లును సెప్టెంబర్ రెండవ వారంలో జరగనున్న శాసనసభ సమావేశాలలో ప్రవేశపెట్టలి :సీతారం దూళిపాల.



**రాజేంద్ర నగర్,ఆగస్టు 28, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహానగర పాలనను ఆధునీకరించేందుకు 1955 నాటి జీ.హెచ్.ఎం.సీ చట్టం స్థానంలో 2026 కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు ప్రతిపాదిత ముసాయిదాను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సమాచారం మేరకు సెప్టెంబర్ రెండవ వారంలో జరగనున్న శాసనసభ సమావేశాలలో ప్రవేశపెట్టనున్న దరిమిలా ది సిటీజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సీతారం దూళిపాల,అందె లక్ష్మణ్ రావు,ఆరీఫ్ మహమ్మద్,బొడ్డు శ్రీధర్,ఆకుల నరేష్ తది తరులందరు ఎమ్మెల్యే కు లందరికీ బహిరంగ లేఖ వ్రాయడము జరిగింది.ప్రజా హితవుకోరి శాసనసభ్యులు బిల్లును సమగ్రంగా పరిశీలించమనీ కొరడమైనది.పాత చట్టం ప్రకారం పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల,సాంకేతిక పరిజ్ఞానం,పరిపాలనా, పౌర సమస్యలకు అనుగుణంగా సమగ్రంగా పునర్వ్యవస్థీ కరించాల్సిన డానికి బదులు రాజ్యాంగబద్ధ వికేంద్రీకరణ,ఎన్నికైన స్థానిక సంస్థల స్వయం ప్రతి పత్తి,ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయకుండా 74వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన పట్టణ స్థానిక సంస్థల హక్కులను హరిస్తూ ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతిపాదిత అపేక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసి స్థానిక సంస్థలపై అధికారం కేంద్రీకరించే విధంగా,ఎన్నికైన కార్పొరేషన్ల స్వయం ప్రతిపత్తికి తూట్లు పొడువడానికి సన్నద్ధం అవుతున్నారు.కావున ప్రజల భాగస్వామ్య పద్దతి ప్రకారం ప్రతి వార్డులో రెండు సంవత్సరాల పదవీకాలంతో సమర్థవంతమైన వార్డు కమిటీలు ఏర్పాటు చేస్తూ అందులో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్,సివిల్ సొసైటీ,మహిళలకు ప్రాతినిధ్యం కల్పించి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి,తీర్మానాలను కార్పొరేషన్/స్టాండింగ్ కమిటీ పరిశీలించే మరియు వాటిపై చర్య తీసుకునే విధానం ఉండాలని సూచించడమైనది.రోజు వారీ పౌర సమస్యల పరిష్కారానికి కమిషనర్, జోనల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లకు తగిన ఆర్థిక,పరిపాలనా అధికారాలను అప్పగించాలని,ప్రభుత్వ విలువలు,వాస్తవ మార్కెట్ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిష్కరించ కుండా క్యాపిటల్ వ్యాల్యు ఆధారిత పన్ను విధానం అమలు చేయడం ద్వారా నిజాయితీగా పన్ను చెల్లించే ప్రజలపై భారం పెరుగుతుంది కావున వార్షిక అద్దె విలువ విధానాన్ని కొనసాగించడం లేదా పారదర్శకమైన,న్యాయమైన ప్రత్యామ్నాయాన్ని పరిశీలించాలని కొరడ మైనది.రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన కార్పొరేషన్ స్థానిక సంస్థ చట్టబద్ధమైన వ్యవహారాలను తానే నిర్వహించుకునే స్వయం ప్రతిపత్తి కలిగి,చట్ట పరిధిలో ఆమోదించిన తీర్మానాలను గౌరవించి అమలు చేయాలని,పదవీ దుర్వినియోగం,తీవ్రమైన ఆర్థిక అవకతవకలు లేదా చట్ట ఉల్లంఘన వంటి అసాధారణ పరిస్థితులు తప్ప,రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా కార్పొరేషన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని కొరడ మైనది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన కార్పొరేటర్లకు తగిన ప్రోటోకాల్,సంస్థాగత పాత్ర, అధికారిక గుర్తింపు చట్టంలో స్పష్టంగా ఉండాలని కొరడ మైనది,ఎన్నికైన కార్పొరేషన్‌ను సస్పెండ్ లేదా సూపర్‌సీడ్ చేసే అధికారం ఏకపక్షంగా వినియోగించ కుండా స్పష్టమైన చట్టపరమైన విధానం,రక్షణలు,జవాబుదారీతనం ఉండాలని కొరడ మైనది.తదనంతరం ప్రతిపాదిత అప్పీలేట్ అథారిటీకి తగిన ట్రిబ్యునల్ స్థాయి న్యాయ పరమైన అధికారాలు,స్వతంత్రత కల్పించి,మున్సిపల్ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించేలా చేయాలి.అదే సమయంలో ప్రస్తుత బహుళ అంతస్తుల ట్రిబ్యునల్ తో అధికార పరిధి స్పష్టంగా నిర్వచించాలని ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు..

# మల్కాజిగిరి రైల్వే పనులకు రాష్ట్ర సహకారం కావాలి

- కేంద్ర రైల్వే మంత్రి అనుమతులు ఇచ్చారు.. సీఎస్‌ను కోరిన ఎంపీ ఈటల రాజేందర్



**నేరెడ్ మెట్ , ఆగస్టు 28, నేటి శుభోదయ :** మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రైల్వే లైన్లు, ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఆయన చ ర్చించారు. మ ల్కాజిగిరి పరిధిలో రైల్వే లైన్ సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈటల తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణానికి అనుమతులు పొందినట్లు చెప్పారు. కొత్త నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి సూచించారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులతో సమావేశమై పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని సీఎస్‌ను కోరినట్లు వెల్లడించారు.మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మూడు మున్సిపాలిటీలు గ్రామీణ ప్రాంతాలతో ముడిపడి ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో అర్బన్, రూరల్ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులను పునరుద్ధరించి కొనసాగించాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్న కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనడం లేదని ఈటల ఆరోపించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చిన్న పనులకు కూడా టెండర్లు దాఖలు చేసే పరిస్థితి లేదన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం అడ్డంకి కాదుఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఆటంకం కల్పించడం లేదని ఈటల స్పష్టం చేశారు. మూడేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కోరిన నిధుల కంటే రూ.100 కోట్లు అధికంగానే కేంద్రం ఇచ్చిందని పేర్కొన్నారు. నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి తనతో చర్చకు రావాలని సవాల్ చేశారు.అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఒక మాట, గల్లీలో మరో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి సంకుచిత ఆలోచనతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం విపక్ష పార్టీల నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు ఇవ్వలేదని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తోందని అన్నారు.తెలంగాణ పరిస్థితి 'పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా' మారిందని ఈటల రాజేందర్ విమర్శించారు. సక్రమమైన ఆలోచన ఉన్న నాయకులకు అభివృద్ధి అర్థమవుతుందని, వక్రబుద్ధితో ఉన్న వారికి బీజేపీ చేస్తున్న అభివృద్ధి కనిపించదని వ్యాఖ్యానించారు.

# స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం .

**ఏన్కూర్,ఆగష్టు 28, నేటి శుభోదయ :** ఏన్కూరు గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు ఈనెల 31 సోమవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేము రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. ఐదో తరగతిలో బీసీ –ఏ 4, బిసి బి 3, బి సి డి 1, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో ఎస్ టి 2, బి సి బి 2, బి సి డి 3, బీసీఈ 2, ఆర్ఫాన్ 1, ఈడబ్ల్యూఎస్ 3, ఎంపీసీ లో ఈడబ్ల్యూఎస్ 1 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తమ భూమిలో ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే తొలగించాలి : స్థానికుడు బాలగౌని బాలరాజ్ గౌడ్ డిమాండ్

**ఘట్కేసర్, ఆగష్టు 28,నేటి శుభోదయ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ పరిధిలోని సర్వే నంబర్ 93లో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే తొలగించాలని స్థానికుడు బాలగౌని బాలరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నోజిగూడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 93 లో భూమికి సంబంధించి అసలు పట్టాదారు ఉస్కె నర్సింహారెడ్డి నుండి తాను చట్టబద్ధంగా జీపీఏ మరియు సేల్ డీడ్ హక్కులు పొంది ఉన్నానని బాలగౌని బాలరాజ్ గౌడ్ పేర్కొన్నారు . పూర్తి చట్టబద్ధమైన హక్కులు, డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నప్పటికీ, నిబంధనలకు తిలోదకాలిచ్చి బోయినపల్లి మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు అధికారులు విద్యుత్ కనెక్షన్ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. ఇందుకు సంబందించి తప్పుడు సమాచారంతో, అక్రమ మార్గాల్లో పొందిన ఈ కనెక్షన్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ కి ఫిర్యాదు చేసామన్నారు . విద్యుత్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలనీ, తనకు న్యాయం జరిగే వరకు చట్టపరంగా పోరాటం కొనసాగిస్తానని బాలగౌని బాలరాజ్ గౌడ్ స్పష్టం చేశారు.

# నీట్–పీజీ 2026 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

- ఖమ్మం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు – 668 మంది విద్యార్థులు హాజరు
- ఉదయం 7:00 గంటల నుంచి 8:30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతి



**ఖమ్మం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలో ఆగస్టు 30న ఆదివారం నిర్వహించనున్న నీట్–పీజీ 2026 పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో నీట్–పీజీ 2026 పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని అయాన్ డిజిటల్ జోన్, లక్ష్య కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఒక కేంద్రం, ఖమ్మంలోని పాకబండ బజార్‌లోని స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 668 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.పరీక్ష ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పిడీసీఎల్ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో హెల్త్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని పోలీస్ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 7:00 గంటల నుంచి 8:30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా కలర్ ప్రింట్ ఔట్ అడ్మిట్ కార్డుతో పాటు ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఎం.బి.బి.ఎస్. పర్మనెంట్ /ప్రొవిజనల్ మెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలర్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్ అనుమతించబడవని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా నిబంధనలను తప్పని సరిగా పాటిస్తూ, ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి

- బషీర్‌బాగ్ పోరాట ఫలితంగానే నేడు రైతులకు ఉచిత విద్యుత్: సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్



**వికారాబాద్ ఆగస్టు 28, నేటి శుభోదయ :** వికారాబాద్: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ పిలుపునిచ్చారు. విద్యుత్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా శుక్రవారం వికారాబాద్ రెస్టు హౌస్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరులు బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆర్. మహిపాల్ మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద విద్యుత్ ప్రైవేటీకరణ, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ అమరులయ్యారని గుర్తు చేశారు. వారి త్యాగాల స్ఫూర్తితో సాగిన ఉద్యమం కారణంగానే అప్పట్లో విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందని తెలిపారు.బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట ఫలితంగానే నేడు రైతులకు ఉచిత విద్యుత్, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలవుతున్నాయని మహిపాల్ పేర్కొన్నారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపే విధానాలను గతంలోనూ ప్రజా ఉద్యమాలు అడ్డుకున్నాయని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఈ చట్టం అమలైతే రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్‌కు దూరం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల కోసం ప్రత్యేక డిస్కం ఏర్పాటు పేరుతో విద్యుత్ రంగంలో సంస్కరణలను అమలు చేసి రైతులపై భారం మోపేందుకు ప్రయత్నిస్తోందని మహిపాల్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని చూస్తున్న విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, చందు, కిషన్, మల్లేష్, రమేష్, యాదయ్య, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్–2026 హియరింగ్ ప్రక్రియపై ఏఈఆర్‌ఓలు, సూపర్వైజర్లకు కమిషనర్ సూచనలు

**ఖమ్మం, ఆగష్టు 28, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఎస్ఐఆర్–2026కు సంబంధించి హియరింగ్ ప్రక్రియ ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, హియరింగ్ నిర్వహణపై సంబంధిత ఏఈఆర్‌ఓలు, అదనపు ఏఈఆర్‌ఓలు, సూపర్వైజర్లతో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.హియరింగ్ ప్రక్రియ ఆయా ఏఈఆర్‌ఓల పరిధిలో సక్రమంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. హియరింగ్‌కు సంబంధించిన నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు నిర్ణీత ప్రక్రియ ప్రకారం హాజరు కల్పించి, వారి వద్ద ఉన్న ఆధారాలు, పత్రాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రేపటి నుంచి ప్రారంభమయ్యే హియరింగ్ ప్రక్రియకు సంబంధిత సూపర్వైజర్లు తప్పనిసరిగా హాజరై, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాలు, పత్రాల ఆధారంగా క్లియర్ చేయాల్సిన అంశాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.అదేవిధంగా, క్లిష్టమైన కేసులు లేదా అదనపు పరిశీలన అవసరమైన అంశాలకు సంబంధించి పూర్తి వివరాలతో డాక్యుమెంట్లను సేకరించి సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. హియరింగ్ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.





## పువ్వాడ ఉదయ నగర్ లో ఇల్లు కూల్చివేత ఘటన వెనుక రౌడీ షీటర్లు

- సర్పంచ్ అండదండలతోనే రెచ్చిపోయిన మూక
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పలు సంఘాల నాయకుల ఆరోపణలు







**ఖమ్మం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** జిల్లా కేంద్రం కు అతి సమీపంలో గల రఘునాధపాలెం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామంలో గురువను రాత్రి పేద లంబాడి గిరిజన మహిళ భూక్య నాగేంద్ర అనే మహిళ ఇంటిని కొందరు కూల్చి వేశారు. గురువారం ఉదయం సంఘటన స్థలానికి సందర్శించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుంతేటి వీరభద్రం , మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీను , బహుజన జెఏసి నాయకులు సంగ మేశ్వర రావు , లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక పేద గిరిజన మహిళ ఇంటిని రాత్రిపూట ఎవరూ లేని సమయంలో కూల్చివేయటం దారుణమని విమర్శిస్తూ ఈ ఘటన వెనుక రౌడీ శీటర్లతోపాటు గంజాయి బ్యాచ్ ఉన్నట్లుఆరోపించారు. దీని వెనుక తనకు తాను సిపిఐ నాయకుడిగా ప్రకటించుకుంటున్న యాకోబ్, ఎలుక శివ , స్థానికుడు, మాజీ ఉప సర్పంచ్ భర్త వీరన్న , ప్రస్తుత సర్పంచ్ అనుచరులు ఇస్మాయిల్, వడ్లకుంట శివ మరి కొంతమంది ఈ ఇల్లు కూల్చివేతల్లో పాల్గొన్నట్లు స్థానికులు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారని తెలిపారు. అధికార పార్టీ కాంగ్రెస్ కు చెందిన పువ్వాడ ఉదయ నగర్ సర్పంచ్ సిద్దిక్ ప్రోబలం సహాయ సహకారాల కారణంగానే ఈ మూక ఈ దారుణానికి పొడిగట్టిందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధమైన సంఘటన జరిగితే దీనిపై రఘునాధపాలెం పోలీస్ స్టేషన్లో , స్థానిక తాసిల్దారు కు కూడా ఫీ ర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూల్చి వేసిన ఇంటిని పునర్ నిర్మించి, ఇంటిలోని సామాన్లను ధ్వంసం చేసిన దానికి నష్టప రిహారం నిందితులనుండే వసూలు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పువ్వాడ ఉదయ నగర్ లో తరచు సంభ వించటం అక్కడి పరిపాలన వ్యవస్థను , అక్కడి శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతుందనీ పేర్కొన్నారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా పువ్వాడ ఉదయ నగర్ పై దృష్టి సారిం చాలని , అక్కడి ప్లాట్ల క్రయవిక్రయాలపై సమగ్ర విచారణ జరి పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉదంతంపై జిల్లా కలెక్టర్ తో పాటు ఖమ్మం పోలీస్ కమిషనర్లకు సోమవారం పలు సంఘాల నాయకులు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, పువ్వాడ ఉదయ నగర్ లో జరిగే పలు అంశాలపై ప్రశ్నించడం కారణంగా, నాగేంద్ర ఆమె బంధువు కావడం ఇల్లు కూల్చివేతకు మరో కారణం అంటూ వివరిం చారు. వ్యక్తిగత విషయాలలో ప్రతిష్టకు పోయి అమాయక, పేద లంబాడి మహిళ భూక్య నాగేంద్ర ఇల్లు కూల్చివేతకు సిద్ధమైన వీరిని వెంటనే అరెస్టు చేయాలని, వీరందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నల్ల నాగమణి, ఏ. సరోజిని,వినోద, జక్కం స్వాతి బీ..సుశీల తదితరులు పాల్గొన్నారు.

## కాపర్ మెటీరియల్ దోపిడీ కేసులో ఒక నిందితుడి అరెస్ట్




**సంగారెడ్డి, ఆగస్టు 28, నేటి శుభోదయ :**
రూ.1.13 కోట్ల విలువైన దొంగసొత్తు స్వాధీనం.· కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సిసిఎస్, మునిపల్లి, సదాశి వపేట పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.కేసు వివరాల్లోకి వెళితే:తేది 18/19-08-2026 అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లోని బోలక్‌పూర్, ముషీరాబాద్ ప్రాంతంలోని సన్‌లైట్ మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ముంబై/అమర్‌నాథ్‌కు 171 ప్లాస్టిక్ బ్యాగుల్లో కాపర్ ముడి పదార్థాన్ని తరలిస్తున్న MH13DQ5107 నంబర్ గల ఈచర్ వాహనాన్ని సంగారెడ్డి జిల్లా మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని NH-65పై బుదేరా ఫ్లైఓవర్ దాటిన అనంతరం పాట్నం హైవే హోటల్ సమీపంలో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి అడ్డగించి, కత్తులతో బెదిరించి వాహన డ్రైవర్ సైఫూన్, తండ్రి ఇమామ్‌ను బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకుని, అనంతరం ఆరూర్ పరిధిలో వదిలివె ళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే మునిపల్లి పోలీసులు ఈచర్ వాహనంలోని GPS లొకేషన్‌ను ఉపయోగించి సుమారు 04:30 గంటలకు ఆరూర్ పరిధిలో వాహనాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 48 బ్యాగుల కాపర్ మెటీరియల్ మాత్రమే ఉండగా, 123 బ్యాగులు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన కాపర్ ముడి పదార్థం విలువ సుమారు రూ.1.13 కోట్లు.ఈ ఘటనపై ఫిర్యాదుదారు మొహమ్మద్ ఫయాజుద్దీన్, S/o మొయిజుద్దీన్, వయస్సు 36 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: బోలక్‌పూర్, ముషీ రాబాద్, హైదరాబాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునిపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.124/2026, సెక్షన్ 309(4) BNS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. ఆదేశాల మేరకు సిసిఎస్ సంగారెడ్డి మరియు మునిపల్లి, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు, వాహనాల కదలికలు, టోల్‌గేట్ సమాచారాన్ని విశ్లేషిస్తూ దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో తేది 27-08-2026న అనుమానిత DCM వాహనం TG12T9240 కంకోల్ టోల్‌గేట్ దాటి జహీరాబాద్ వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసు బృందం దిగ్వాల్ గ్రామం సమీపంలో సుమారు 17:32 గంటలకు DCM వాహనాన్ని అడుకుని తనిఖీ చేసి, వాహనంలో ఉన్న A-2 షేక్ సబీర్ షరీఫ్, అదుపులోకి తీసుకుని మునిపల్లి పోలీస్ స్టేషన్‌కు తర లించారు.విచారణలో A-2 తన ప్రమేయాన్ని వెల్లడించడంతో పాటు A-1 సోహెల్ మరియు మరో 10 నుంచి 11 మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలిపాడు. చోరీ చేసిన కాపర్ మెటీ రియల్‌ను తరలించేందుకు TG12T9240 నంబర్ గల DCM వాహనంతో పాటు TS08UH8812 నంబర్ గల అశోక్ లేలాండ్ DOST వాహనాన్ని ఉపయోగించినట్లు వెల్లడించాడు.A-2 ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టి, చోరీకి గురైన కాపర్ మెటీరియల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న సొత్తు:1. 123 ప్లాస్టిక్ బ్యాగుల్లో ఉన్న చోరీకి గురైన కాపర్ ముడి పదార్థం.2. నల్లటి రంగు టార్పాలిన్ కవర్.3. DCM వాహనం నం. TG12T9240.4.అశోక్ లేలాండ్ DOST (BSVI) వాహనం నం. TS08UH8812.5. చోరీకి గురైన ఈచర్ వాహనం నం. MH13DQ5107, అందులో మిగిలిన 48 బ్యాగుల కాపర్ మెటీరియల్‌తో సహా.చోరీకి గురైన కాపర్ ముడి పదార్థం మొత్తం విలువ సుమారు రూ.1.13 కోట్లు.నిందితుడి వివరాలు: A-2 షేక్ సబీర్ షరీఫ్ తండ్రి: జహంగీర్ షరీఫ్, వయస్సు: 26 సంవత్స రాలు, వృత్తి: డ్రైవర్, నివాసం: వార్సిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్.దర్యాప్తులో పోలీసుల ప్రతిభ: మునిపల్లి పోలీసులు సమాచారం అందుకున్న వెంటనే స్పందించి GPS ఆధారంగా చోరీకి గురైన ఈచర్ వాహనాన్ని గుర్తించడం, సాంకేతిక మరియు శాస్త్రీయ ఆధారాలను విశ్లేషించడం, వాహనాల కదలికలు పరిశీలించడం, విశ్వసనీయ సమాచారం తో దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు. ఎవి కేసు ఛేధనలో ప్రత్యేక క్రైమ్ బృందాల సమన్వయంతో చేపట్టిన దర్యాప్తు ఫలితంగా A-2ను అరెస్ట్ చేసి, రూ.1.13 కోట్ల విలువైన 123 బ్యాగుల కాపర్ ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకోవ డంతో పాటు, నేరానికి ఉపయోగించిన వాహనాలను కూడా సీజ్ చేయడం జరిగింది.ఈ కేసును త్వరితగతిన ఛేదించి, భారీ మొత్తంలో దొంగసొత్తును స్వాధీనం చేసుకోవడంలో సిసిఎస్ టీం, మునిపల్లి మరియు సదాశివపేట పోలీసుల సమన్వయ కృషిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. అభినందిం చారు.

## రాఖీ కట్టి ఆశీర్వాదం పొందిన సోదరీమణులు





**వికారాబాద్, ఆగస్టు 28 , నేటి శుభోదయ :** వికారాబాద్: రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజ కవర్గ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్‌ను పలువురు సోదరీమణులు కలిసి రాఖీ పండుగ శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్‌కు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి తమ ఆప్యాయతను చాటుకున్నారు. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.సోదర, సోద రీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరీమణులు ప్రసాద్ కుమార్‌తో తమ అనుబంధాన్ని పంచుకున్నారు.

## ఆదర్శ ఫౌండేషన్ లోని అనాధ బాలికల మధ్య రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి



**చైతన్యపురి, ఆగస్టు 28, నేటి శుభోదయ :** రాఖిపౌర్ణమి సందర్భంగా దిల్సుఖ్ నగర్ లోని ఆదర్శ ఫౌండేషన్ లోని అనాధ బాలికల మధ్య రాఖీ సెలెబ్రేషన్స్ చేసుకోన్న పిల్లల మధ్య భోజనం చేసిన చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి. మిత్రులు ప్రసాద్, ప్రశాంత్.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జలంధర్, చింటు, నాగరాజు, శ్రవణ్, రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

## శానమోని బాలకృష్ణ యాదవ్

### - శ్రీలతల వివాహ వేడుకలకు హాజరైన

- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని అభిలాష రావు





**వనపర్తి, ఆగస్టు 28, నేటి శుభోదయ :** చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శానమోని బాలకృష్ణ ఆహ్వానం మేరకు శనమోని బాలకృష్ణ యాదవ్, శ్రీలతల వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగనేని అభిలాష్ రావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ యాదవ్, శ్రీలతలకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన అభిలాష రావు వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిం చారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖులు వివాహ వేడుకల్లో పాల్గొన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని అభిలాష రావు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో రంగినేని అభిలాష రావు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నూతన దంపతులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి కుటుంబ సభ్యులను, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రాజకీయ నాయకులను, బంధుమిత్రులను, ఆప్యాయంగా పలకరిస్తూ అందరితో ముచ్చటిస్తూ సరదాగ గడిపారు.

# సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీక : టిజిఓరాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు

- మహిళల రక్షణ, గౌరవం, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- సమాజంలో సోదరభావం, కుటుంబ బంధాలను మరింత పెంపొందించేందుకు రక్షాబంధన్ స్ఫూర్తినిస్తుంది
- కలెక్టరేట్ లో రాఖీ కట్టి, మిఠాయి అందించిన బ్రహ్మా కుమారీలకు శుభాకాంక్షలు తెలిపిన టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు





**ఖమ్మం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందనీ టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో బ్రహ్మకుమారీలు టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు కి రాఖీ కట్టి, మిఠాయి అందించారు. ఈ సందర్భంగా టిజిఓ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు గారు వారికి శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ మరియు రాష్ట్ర మహిళా ఉద్యోగులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఆప్యాయతలను పెంపొందించేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.సోదరీమణుల రక్షణ, గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం కుటుంబం, సమాజం మొత్తానికి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి హక్కులు, భద్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు.రాఖీ పండుగ కేవలం సోదర, సోదరీమణుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారం, మానవతా విలువలను మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని,రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్రలోని మహిళా మణులు ఉద్యోగులు అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సోదరభావంతో, ఆనందంగా ఉండాలని టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొనదన శ్రీనివాసరావు టీఎన్జీవో మాజీ అధ్యక్షులు పొట్ట పింజర రామయ్య జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కే దుర్గాప్రసాద్ తెలంగాణ మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అస్లాం మరియు బిసి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఏవో చంద్రశేఖర్ కళ్యాణ్ మరియు బ్రహ్మకుమారీలు రాజయోగిని, బికె. అరుణ, బికె.గీత తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు రాఖీలు కట్టిన మహిళా అధికారులు



**వికారాబాద్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జయసుధ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) చెన్నమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి కవిత కలెక్టర్‌కు రాఖీలు కట్టారు.అధికారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షిస్తూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు అందజేశారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీక అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# తన తమ్ముడికి రాఖీ కట్టి ఆశీర్వదించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**రాజేంద్ర నగర్,ఆగస్టు 28, నేటి శుభోదయ :** అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ మనకుటుంబ విలువలను,ప్రేమానురాగలను మరింత బలోపేతం చేస్తాయని మాజీ మాత్రి,మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు.రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన తమ్ముడు నరసింహారెడ్డి నివాసంలో రాఖీ కట్టి,అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ,ఆప్యాయత,అనురాగాలను నిలిచే ఆత్మీయ పంచుకున్నారు.ఈ పవిత్రమైన రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి ఇంట్లో అక్కాచెల్లెళ్ల జీవితాల్లో అన్నదమ్ముల ప్రేమ,ప్రతి అన్నదమ్ముల జీవితాల్లో అక్కాచెల్లెళ్ల ఆప్యాయత ఎల్లప్పుడూ నిండాలని,ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నియోజకవర్గం ప్రజలందరికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# స్మార్ట్ కిడ్జ లో ఆనందోత్సవాలతో రక్షాబంధన్

## - వెల్లివిరిసిన ఆత్మీయ సోదర,సోదరీమణుల ప్రేమ










**ఖమ్మం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** సోదర సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం స్థానిక స్మార్ట్ కిడ్జ పాఠశాలలో ఆనందోత్సవాలతో నిర్వహించారు. ప్రతి తరగతిలో పాఠశాల విద్యార్థులకు బాలికలు రక్షణ కట్టి తమ అనుబంధాన్ని చాటారు. బాలుర ముంజేతికి రక్షాబంధన్ కట్టి, బాలికలు వారికి మిఠాయిలు తినిపించి ఆప్యాయతను చాటారు. విద్యార్థులందరిలో సోదర ప్రేమ వెల్లి విరిసింది. రాఖీలు కడుతున్నంతసేపు బాలుర ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాలలోని చెట్లకు విద్యార్థులు రాఖీలు కట్టి తమ వృక్ష బంధాన్ని తెలియజేశారు. దీనితో పాటు పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు, వాచ్మెన్, డ్రైవర్స్, తమ ఫోటోలు ఎల్లప్పుడూ తీస్తున్న ఫోటోగ్రాఫర్స్ కు పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ "విద్యార్థులలో సహోదర ప్రేమ విలువను తెలియజేసేందుకు రక్షాబంధన్ వేడుకలను పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ★అన్నాచెల్లెళ్ల అనుబంధం...జీవితాంతం నిలిచే ఒక మధురమైన బంధం★★చేతికి కట్టే రాఖీ ఒక దారం మాత్రమే కాదు... ప్రేమకు, నమ్మకానికి, ఆప్యాయతకు ప్రతీక★అని,పురాణాల కాలం నుండి ప్రత్యేకంగా మన దేశంలోని అన్ని ప్రాంతాలలో రక్షాబంధన్ వేడుకలకు మహోన్నత స్థానం ఉందని పేర్కొన్నారు. తోడబుట్టిన సోదరులకే కాకుండా ఇతరులను సోదరులుగా భావించి రాఖీలు కట్టే సంప్రదాయం మనదేశానికే సొంతం అని తెలియజేశారు. రాఖీ పర్వదినం ప్రజలందరిలో అనురాగ ఆప్యాయతలను, ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు."ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్బాల్ కి ఆరుగురు మల్లెమడుగు విద్యార్థినీలు ఎంపిక



**ఖమ్మం,ఆగస్టు 28, నేటి శుభోదయ :** గురువారం ప్రకాశం స్టేడియం కొత్తగూడెం నందు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్బాల్ చాంపియన్షిప్ సెలక్షన్స్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లెమడుగు విద్యార్థినిలు ఏ. వెన్నెల, కె.అనిత, ఎస్.కె. నసీమ, వి.పల్లవి, టి.నవ్య శ్రీ ,మరియు ఎన్. వినీత స్టాండ్ బై గా జిల్లాలో అత్యంత ప్రతిభ కనబరిచి సెప్టెంబర్ 4 నుండి 7 వరకు నిజాంబాద్ లో జరిగే జూనియర్స్ అండర్ 16 ఇయర్స్ బాలికల రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాంబమూర్తి, పిడి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల పిడి కృష్ణయ్యను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి,గ్రామ పెద్దలు నూకారపు వెంకటేశ్వరరావు, భోజర్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, కృష్ణ,మనోజ్, సైదులు మాజీ కార్పొరేటర్లు నిరంజన్ కుమార్, లలితా రాణి, జానీ మియా, బట్ట పోతుల సతీష్, తదితరులు ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్ కాలంలో జాతీయస్థాయికి ఎదగాలని కోరారు.

# గచ్చిబౌలి లో ఐబెక్స్ - క్లౌడ్ డాట & ఏ I సంస్థ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం

**గచ్చిబౌలి , ఆగష్టు28, నేటి శుభోదయ :** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలోని మహావీర్ గేట్‌వేలో ఏర్పాటు చేసిన ఐబెక్స్ – క్లౌడ్, డాటా & ఏ I సంస్థ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం రోజు ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ “ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా టెక్నాలజీ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. హైదరాబాద్ నగరం ఇప్పటికే ఐటీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. క్లౌడ్ , డాటా & ఏ I వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో మరిన్ని సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం సంతోషకరం. ఇలాంటి సంస్థల ద్వారా యువతకు నూతన ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు తెలంగాణ ఐటీ రంగం మరింత బలోపేతం అవుతుంది” అని పేర్కొన్నారు.ఐబెక్స్ ల్యాబ్స్ సంస్థ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది, దేశ విదేశాల్లో మంచి గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు. సంస్థ యాజమాన్యానికి, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అమిత్ రెడ్డి, ఐబెక్స్ సంస్థ చైర్మన్ శ్రీధర్ అడుసుమిల్లి, సీఈఓ శ్రీరామ్, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# నియోజకవర్గ పరిధిలోని ఎక్కడికక్కడే అక్రమ షెడ్లపై కొరడా..







**శేరిలింగంపల్లి , ఆగస్టు 28 , నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధి లోని సర్వేనెంబర్ 44/4 లో మియాపూర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల కూల్చివేతలు.. సస్పెండ్ అయిన గడ్డం శీను మళ్లీ ప్రత్యక్షం ..శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని మియాపూర్ బీకే ఎంక్లేవ్ రోడ్డు పక్కన రెండు పెద్ద షెడ్లు నిర్మాణం జరుగుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులకు సమాచారం వెళ్లిపోవడంతో అక్రమ షెడ్లను తొలగించేందుకు అధికారులు నేరుగా జెసిబి తీసుకొచ్చి షెడ్లు తొలగించడం జరిగింది.అక్రమ షెడ్లను ఎట్టి పరిస్థితుల్లో తొలగిస్తామన్న వాదనలు వినిపిస్తున్నప్పటి కీ,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లను అధికారులు శుక్ర వారం రోజు డెమాలిషన్ యంత్రాల తో కూల్చివేశారు.అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు,నిబంధనల ఉల్లంఘనలను పరిశీలించిన అనంతరం అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇటీవల కొన్ని పత్రికలలో చందానగర్ జిహెచ్ఎంసి లో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తూ, ఇతనిపై పలు ఫిర్యాదులు ఉన్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు సస్పెండ్ చేసినట్లు వాళ్లు ప్రింట్ మీడియాలలో వార్తలు ప్రచురితమై వారం గడవకముందే మళ్లీ గడ్డం శీను కూల్చివేతల దగ్గర దర్శనం కావడం చాలా మంది జీర్ణించుకోలేక పోతున్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూలు పోగు జంధ్యాల పౌర్ణమి వేడుకలు...



**ఖమ్మం, ఆగస్టు 28, నేటి శుభోదయ :** నగరంలోని ప్రభటాకీస్ రోడ్ నందు గల రామాలయం గుడి లో ఖమ్మం జిల్లా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నూలుపోగు జంధ్యాల పౌర్ణమి రాఖి పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో పద్మశాలి కుల బాంధవులు సోదరీ సోదరీమణులు భారీ గా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు చిలకమర్రి శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరికి రాఖీపండగా శుభాకాంక్షలు తెలుపుతూ భారతదేశంలో అన్నాచెల్లెళ్ల ప్రేమా ఆనురాగాలకు ప్రతీక రాఖీ పండుగా అని అన్నారు. ప్రతి సంవత్సరం మా సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారని అదేవిధంగా మా పద్మశాలి ఆరాధ్య దైవమైన మార్కండేయ స్వామి వారికీ పూజ చేసి జంజదారం చేశామని మా సోదరీమణులు మా సోదరులకు రాఖిలు కట్టి శుభాకాంక్షలు తెలిపారని అక్కడికి వచ్చిన ప్రతి ఒక్క సోదరుడికి టవల్, సోదరిమనులకు జాకెట్ ముక్కలు పంపిణీ చేశామని తెలియచేసారు.చిలకమర్రి శ్రీనివాస్ బాబు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు, పెండం జనార్ధన్, గుడ్ల సునీత మహిళా వింగ్ గౌరవ అధ్యక్షురాలు, ఇంజమూరి సంధ్యారాణి,బండారు శ్రీనివాసరావు కూరపాటి సతీష్ చిలుకోటి శ్రీను, చందా వీరభద్రం, మసనం శివ తదితరులు పాల్గొన్నారు...





# మీడియా పేరు చెప్పి దోపిడీ

- రైతును బెదిరించి బలవంతంగా నగదు వసూలు




**ఖమ్మం, ఆగష్టు 28, నేటి శుభోదయ :** మీడియా పేరు చెప్పి బెదిరించి ఓ రైతు వద్ద నుంచి బలవంతంగా నగదు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ నెల 23న తెల్లవారుజామున దమ్మపేటకు చెందిన పండు కిరణ్, సయ్యద్ జానీ అహ్మద్ అనే ఇద్దరు వ్యక్తులు రామచంద్రపురం క్రాస్‌రోడ్డు వద్ద పొగాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను అడ్డగించారు. తాము మీడియా ప్రతినిధులమని చెప్పి, ట్రాక్టర్ నడుపుతున్న ముష్టిబండకు చెందిన రైతు కొలికిపోగు నరేంద్రను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు.దీనికి ప్రతిఘటించిన రైతు డయల్ 112కు ఫోన్ చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో నిందితులు రైతును చంపుతామని బెదిరించి, అతని వద్ద ఉన్న రూ.5 వేల నగదును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,000 నగదు, 'టీ మీడియా' పేరుతో ఉన్న ప్రెస్ ఐడీ కార్డు, నేరానికి ఉపయోగించిన టీవీఎస్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మీడియా గుర్తింపు కార్డులను దుర్వినియోగం చేస్తూ బెదిరింపులకు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వారావుపేట పోలీసులు హెచ్చరించారు.

# తమ్ముళ్ళకి రాఖీ కట్టిన అక్కలు అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు

**- మార్కండేయ నగర్‌లో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు**



**కాటేదాన్, ఆగస్టు 28, నేటి శుభోదయ :** కాటేదాన్ డివిజన్ పరిధి లోని మార్కండేయ నగర్‌లో రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని అక్కలు తమ చిన్ని తమ్ముళ్ళకి రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. తమ్ముని నుదుట తిలకం దిద్ది, రాఖీ కట్టి వారి సుఖసంతోషాలను ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్కలు తమ్ముళ్లపై ప్రేమ అనురాగాలతో రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు సోదర సోదరీమణుల మధ్య ప్రేమ ఆప్యాయత అనుబంధానికి పత్రికగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆనందోత్సవాలతో వేడుకల్లో పాల్గొన్నారు. అక్కాచెల్లెళ్ల ప్రేమకు, అన్నదమ్ముల ఆప్యాయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతాయని తెలిపారు. “రాఖీ దారం చిన్నదైనా.. అందులో దాగి ఉన్న ప్రేమానుబంధం ఎంతో గొప్పది” అంటూ వేడుకల్లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు....

# స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ శ్రీనగర్ లో రాఖీ వేడుకలు



**ఖమ్మం, ఆగష్టు 28, నేటి శుభోదయ** స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో “రాఖీ పూర్ణిమ” వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో రక్షాబంధన్ వేడుకలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలను కట్టి వారందరు వారి లక్ష్యాలను, విజయాలను సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న భారతీయ సాంప్రదాయంలోని రాఖీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ రాఖీ(రక్షా) అనగా రక్షణ, బంధన్ అనగా సూత్రం అని అక్కా, చెళ్ళెలు తమ సోదరులు చేసే ప్రతి మంచి పనిలో విజయాలను సాధించాలని నుదుటన తిలకం దిద్ది చేతికి రక్షాబంధన్ కట్టి హారతి ఇచ్చి, ఆశీర్వాదం తీసుకుంటారని సోదరులు తమ అక్కా, చెళ్ళెలకు ఎల్లప్పుడు మీకు నేను రక్షణగా ఉంటానని ఆశీర్వదించి, మంచి బహుమతులను అందజేస్తారని స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మన సంస్కృతి సంప్రాదాయాలను వారి జీవితంలో ఒక భాగంగా పెంపొందిస్తామని తెలియజేస్తూ అందరికి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. రాఖీ పండగను పురస్కరించుకొని విద్యార్థినులందరూ రాఖీలను తెచ్చి సోదర సమానులైన తమ స్నేహితులకు రాఖీలను కట్టి తమకు రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తూ వారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఎంతో ఉత్సాహంగా కేరింతలతో గురువుల మధ్యన ఈ రాఖీ వేడుకలలో పాల్గొని అందరిని ఆనందింపజేసి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేసారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620